# కలసి వచ్చిన కాలం

రచన
శ్రీ కలగర్ల నీలకంఠేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

'మా ఆడపడచుగారమ్మాయి సుభద్రమ్మగారూ! మీరు చూడనేలేదా?' అంటూ లోపలినుండి కామాక్షమ్మ వచ్చింది.

'అలాగా? ఎంత చక్కగా వుందీ!' అంది అమ్మ.

వయస్సులోనున్న అమ్మాయిలను చూసిందంటే చాలు, మా అమ్మ వారందరికీ 'చక్కదనం' సర్టిఫికేట్లు ఇచ్చేస్తుంది.

'రండి సుభద్రమ్మగారూ! వ్రతం చూద్దురుగాని.' అంటూ కామాక్షమ్మ మమ్మల్ని లోపలికి తీసుకొని వెళ్ళింది.

వ్రతం దివ్యంగా జరిగింది. ప్రసాదం తీసికొని ఒక్కొక్కరే నిష్క్రమించేరు. ఆఖరున శ్యామల ప్రసాదం నా చేతిలో వేస్తూ 'వసుంధరా! మంచి భర్త కావాలని మనసులో తలచుకొని ప్రసాదం తిను' అన్నది.

'దానికి మంచి భర్త ఎందుకు రాదు శ్యామలా? చందనపు బొమ్మలా వుంటే.' అంటూ కామాక్షమ్మ వంత పాడింది.

'ఛీ! నాకు భర్తా, గిర్తా ఏమీ అక్కరలేదు.' అన్నాను ఈసడింపుతో.

'పోనీ భార్య కావాలా?' అన్నది శ్యామల.

'ఓ! నువ్వు భార్యవౌతావంటే కావాలి' అన్నాను.

'హాస్యాలు చాలు వెళ్ళి భోజనాలు చెయ్యండి' అన్నది కామాక్షమ్మ.

భోజనాల అనంతరం ఆడవాళ్ళందరూ తాంబూలాలు నములుతూ ఒకచోట కూడారు. ఇంకేముంది పనికిరాని ప్రసంగాలు, అసందర్భమైన చర్చలు, పెళ్ళిళ్ల ప్రసక్తులు రావటం సహజమేకదా! మాటల మధ్యలో కామాక్షమ్మ మా అమ్మతో 'సుభద్రమ్మగారూ! మీ శ్రీధర్‌కు సంబంధాలు చూడటంలేదా?' అన్నది.

'వస్తూనే వున్నాయి కామాక్షమ్మగారూ! కానీ తగిన వధువు దొరికితేగాని పెళ్ళి చేసుకోటానికి ఇష్టంలేదు వాడికి' అన్నది మా అమ్మ.

'మీకేం తక్కువ? లక్షాధికార్లు శ్రీధర్ కూడ పెద్ద చదువులే చదివాడుగదా!'

'ఏదోనమ్మా. వాడికి కల్యాణరేఖ తన్నుకరావాలి గదా. మీ ఎరికలో ఏవైనా సంబంధాలు వుంటే చూద్దురూ.'

'సంబంధాలైతే వున్నవిగానీ, మీ స్తోమతుకు తగ్గవి లేవు.'

'స్తోమతా? అంటే?'

'మరేంలేదు. పేదవారు.'

'కామాక్షమ్మగారూ! పేద, గొప్ప అనే భేదం మేం చూడం. అమ్మాయి లక్షణంగా వుంటే చాలు' అన్నది అమ్మ.

'ఇందాక ఆ అమ్మాయిని చూశారుగా మీకెలా వుంది?'

'ఆ అమ్మాయికేం? బంగారంలా వుంది. నేనే మిమ్మల్ని ముందుగా అడుగుదామనుకున్నాను.'

'కానీ కట్నం కానుకలు...'

'అవన్నీ మాకనవసరం. ఆ అమ్మాయి మా ఇంట్లో అడుగుపెడితే చాలు.'

'మరి మీ శ్రీధర్ ఐ. ఎ. ఎస్. పాసయ్యాడుకదా. ఆ అమ్మాయి అంతగా చదువుకోలేదే.' తన ఆఖరు సందేహం వెళ్లబుచ్చింది కామాక్షమ్మ.

'మా శ్రీధర్ సంగతి మీకు తెలియదు కామాక్షమ్మగారూ! ఆడంబరాలంటే వాడికి కిట్టవు. వధువు చదువు రానిదైనాసరే మాకు అభ్యంతరంలేదు. సరేనా?' అన్నది మా అమ్మ.

ఈ సంభాషణలు వింటుంటే కలా? నిజమా? అని అనిపించింది నాకు. నేను అనుకున్న విధంగానే శ్యామల మా అన్నయ్య భార్య కాబోతుంది. భగవంతుడికి మనసులోనే ధన్యవాదాలర్పించుకున్నాను.

\+ + +

ఏ ఒడుదుడుకులూ లేక శ్రీధర్ పెళ్ళి శ్యామలతో జరిగింది. పసుపు వస్త్రాలతోనున్న ఆ నవదంపతులను చూచిన సంతోషంతో నా కళ్ళు ఆనంద భాష్పాలతో నిండాయి.

'అన్నయ్యా! శ్యామలకు ఎప్పుడు క్షమార్పణ చెబుతావు? ఇంకా కాలం కలసిరావాలా?' అన్నాను శ్రీధర్‌తో.

'కాలం కలసివచ్చేసింది చెల్లెమ్మా. క్షమార్పణ చెప్పుకోవాలా?' అన్నాడు శ్రీధర్.

'ఇప్పుడుకాదు. రేపు జరుగబోయేకార్యం తరువాత మీరిద్దరూ వంటరిగా వుంటారుగా అప్పుడు. నీకు చిన్నతనం వేయదుకూడ' అన్నాను.

నుదుటిపైనున్న కల్యాణ తిలకంతోపాటు శ్రీధర్ పెదవులపై చిన్న దరహాసం మెరసింది.